సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



కథ చెబుతాం ఊ కొడతారా..

చిన్నారుల్లో సృజనాత్మకశక్తి పెంచేందుకు ప్రారంభించిన స్టోరీ టెల్లింగ్ డేకు విశేష స్పందన లభిస్తోంది.

10లో



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

లా నేస్తం నగదు విడుదల చేసిన నేపథ్యంలో న్యాయవాదులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

12లో



విద్యాభివృద్ధిరస్తు..!

12లో

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా 2023-24 వార్షిక బడ్జెట్ సిద్ధమైంది. డిజిటల్ చదువులకు ప్రాధాన్యమిచ్చారు.

న్యూస్‌రీల్

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా మార్చి 3,4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. గురువారం సదస్సు నిర్వహించే ఏయూ మైదానాన్ని పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్న దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎం.జి.ఎం పార్కులో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, జీవీఎంసీ, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్



జెండా ఊపి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న రైల్వే సీనియర్ అధికారులు

తాటిచెట్లపాలెం: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో రాకపోకలు ప్రారంభించింది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్‌ను వాల్తేర్ డివిజన్ సీనియర్ అధికారులు బి.రామగోపాలరావు(చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్), డి.వి.ప్రసాద్(చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్), పి.జాన్ తిమోతి (చీఫ్ క్రూ కంట్రోలర్), కె.ఎల్.త్రినాథ్(సీనియర్ టెక్నీషియన్)లు జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు వాల్తేర్ డివిజన్ నిరంతరం కృషి చేస్తుందని.. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడపనున్నట్లు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఓ ప్రకటనలో తెలిపారు. 1-ఏసీ చెయిర్‌కార్, 12-చెయిర్‌కార్, 5-జనరల్ సెకండ్ క్లాస్, 1-సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ కోచ్, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్ మొత్తం 20 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ఈ రైలు నడుస్తుంది.

డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ సందర్శన



వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీని సందర్శిస్తున్న బిశ్వజిత్ దాస్‌గుప్తా

సింధియా: తమిళనాడులోని వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీని తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ బిశ్వజిత్ దాస్ గుప్తా సందర్శించారు. ఈ నెల 21వ తేదీన ప్రారంభమైన ఆయన పర్యటన 23వ తేదీతో ముగిసింది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో సవాళ్లపై 78వ స్టాఫ్ కోర్సులో పాల్గొన్న అధికారులనుద్దేశించి ప్రసంగించారు. అలాగే లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వాట్స్, కమాండెంట్ మరాయు అడ్మిరల్ పురువీర్ దాతో చర్చలు జరిపారు. డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ పురోగతి, సమకాలీన సాంకేతికతను అధికారులు ఆయనకు వివరించారు.

నేడే న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖలీగల్: ప్రతిష్టాత్మకమైన విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ తెలిపారు. 3,047 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల సహాయార్థం ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి. 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతోంది. వివిధ పదవులకు గాను 100 మందికి పైగా న్యాయవాదులు పోటీలో ఉన్నారు.

కూరలు దిగివచ్చిన వేళ..!



- కిలో ఉల్లి రూ.15, బంగాళాదుంపలు రూ.11
- కిలో రూ.8-25 మధ్య పలు కాయగూరలు
- వినియోగదార్లకు ఊరటనిస్తున్న ధరలు
- మరింత దిగివస్తాయంటున్న వ్యాపారులు

సాక్షి, విశాఖపట్నం: కూరగాయల ధరలు దిగివచ్చాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా ఇవి చౌకగా లభిస్తున్నాయి. పేద, మధ్య తరగతి వారికి సరసమైన ధరల్లోనే లభ్యమవుతున్నాయి. విశాఖ నగరంలోని రైతు బజార్లలో పలు రకాల కూరగాయలు కిలో రూ.8 నుంచి 25 మధ్య పలుకుతూ వినియోగదారులకు ఊరటనిస్తున్నాయి. ఒకప్పుడు కిలో రూ.40-50కు ఎగబాకిన ఉల్లిపాయలు ఇప్పుడు రూ.15కే దొరుకుతున్నాయి. కిలో రూ.30కి పైగా ఎగబాకిన బంగాళాదుంపలు రూ.11కి, కిలో రూ.20 ఉండే క్యాబేజీ రూ.8కే అందుబాటులో ఉన్నాయి. ఇలా గతంలో కోరలు చాచిన పలు రకాల కాయగూరలు కొండ దిగుతున్నాయి. వంటకాల్లో ఉల్లిపాయలది అగ్రస్థానం. వీటి వినియోగం అధికంగా ఉంటుంది. అందుకే ఇతర కూరగాయల రేట్లు ఒకింత ఘాటుగా ఉన్నా ఉల్లిపాయల ధర తక్కువగా ఉండాలని అంతా కోరుకుంటారు. ఉల్లి ధరలు పెరిగినప్పుడు అరకొరగా కొనుగోలు చేస్తారు. కూరల్లోనూ పొదుపుగా వాడతారు. ఇక కాయగూరల ధరలు అధికంగా ఉన్నప్పుడు ఎక్కువ సొమ్ము చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. సంచి నిండా వీటిని కొనాలంటే చేతి చమురు భారీగా వదులుతుంది. బడ్జెట్ భారమూ పెరుగుతుంది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, టమాటాలు, వంకాయలు, దొండకాయలు, దేముడు చిక్కుడు, కాలీఫ్లవర్, బీట్‌రూట్, బరబాటి, క్యారెట్ వంటివి చౌకగా లభిస్తున్నాయి. అలాగే కొన్నాళ్ల క్రితం వరకు కిలో రూ.50 ధర ఉండే పచ్చిమిర్చి ఇప్పుడు రూ.24కే దిగివచ్చింది. చాన్నాళ్ల నుంచి కిలో రూ.180-200 వరకు అమ్ముడైన చింతపండు కూడా ఇప్పుడు రూ.100కే లభ్యమవుతోంది. కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు పొదుపుగా కొనుగోలు చేసిన వారు ఇప్పుడు పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తున్నారు. ఇలా కాయగూరల ధరలు అందుబాటులోకి రావడంతో వినియోగదారులు సంతృప్తి చెందుతున్నారు.

రైతుబజార్లలో ధరలు

(కిలో రూ.లలో)

కాయగూరలు	ధర	కాయగూరలు	ధర
క్యాబేజి	8	వంకాయలు (తెల్లవి)	22
బంగాళాదుంపలు	11	దేముడు చిక్కుడు	24
కాలీఫ్లవర్	12	పచ్చిమిర్చి	24
ఉల్లిపాయలు	15	బరబాటి	26
టమాటా	18	దొండకాయలు	26
బీట్‌రూట్	20	క్యారెట్	28
వంకాయలు (కోల్‌కతా)	18	కాకరకాయలు	32
		బీన్స్	36
		వెల్లుల్లి	40
		అల్లం (పాతది)	60

పంటల కాపు బాగుండడమే కారణం

విశాఖ నగరానికి ఉమ్మడి విశాఖ జిల్లాలోని కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం, అనకాపల్లి, ఆనందపురం, పెందుర్తి, పద్మనాభం తదితర మండలాల నుంచి రోజూ కూరగాయలు వస్తుంటాయి. వీటిని హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు రైతు బజార్లకు తరలిస్తారు. కొన్నాళ్లుగా ఆయా ప్రాంతాల్లో కాయగూరల సాగు ఆశాజనకంగా ఉండడంతో ధరలు దిగి రావడానికి దోహదపడుతోందని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ 'సాక్షి'తో చెప్పారు. ఉల్లిపాయలు కర్నూలు, మహారాష్ట్రల నుంచి దిగుమతి అవుతాయి. ఈ ఏడాది ఆయా చోట్ల ఉల్లి పంట బాగుండడంతో గణనీయంగా మార్కెట్లకు రవాణా అవుతోంది. ఫలితంగా ఇవి చౌకగా లభిస్తున్నాయని అంటున్నారు. కాగా రానున్న రోజుల్లో కూరగాయల ధరలు ఇంకాస్త తగ్గే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేద్దాం



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

పీఎంపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలోకి దిగిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా కృషి చేద్దామని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కారుషెడ్ కూడలికి సమీపంలో పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్సీ స్థానం దక్కించుకుని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వడానికి ఇదొక మంచి అవకాశం అన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క పట్టభద్రుడిని కలిసి పార్టీ అభ్యర్థి సుధాకర్ విజయానికి కృషి చేద్దామన్నారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, మాజీ ఎమ్మెల్యేలు పి.బాలరాజు, అల్లు భానుమతి, తైనాల విజయ్ కుమార్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, ఫరూఖీ, భీమిలి ఇన్‌చార్జి మహేష్, 5, 6, 7 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, కె.వరలక్ష్మి, రాజేశ్వరి, సీహెచ్ వెంకటరామయ్య, వంకాయల మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు
- చివరి రోజున 26 నామినేషన్లు దాఖలు
- 27 వరకూ ఉపసంహరణకు గడువు



టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గూనూరు మల్లునాయుడు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజున 26 నామినేషన్లు కలిపి మొత్తం 44 నామినేషన్లు, 70 సెట్లు దాఖలయ్యాయి. ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. గురువారం టీడీపీ తరఫున మరో అభ్యర్థి నామినేషన్ వేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గూనూరు మల్లునాయుడు టీడీపీ రెబల్‌గా మారారు. బీసీలకు టికెట్ అంటూ మోసం చేసిన తెలుగుదేశం పార్టీపై ఎదురు తిరుగుతూ.. రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈర్లె శ్రీరాములు.. టీడీపీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరఫున విశాఖకు చెందిన కొణతాల వెంకట అప్పారావు బరిలో దిగారు.

గత ఎన్నికల కంటే ఎక్కువ మందే...

2017 ఎన్నికల్లో మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సారి ఏకంగా 44 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కనీసం 8 నుంచి 10 మంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది. కాబట్టి.. గత ఎన్నికల కంటే ఎక్కువ మంది తుది పోరుకు బరిలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 331 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3.17 లక్షల బ్యాలెట్ పత్రాలు ముద్రించాలని నిర్ణయించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. పట్టభద్రుల ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారు.? వారి పేర్లని ఆర్డర్ల ప్రకారం ఎలా అమర్చాలి అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బ్యాలెట్ పత్రాల ముద్రణకు సన్నద్ధమవుతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఇప్పటికే వైట్ బ్యాలెట్ పేపర్లకు సంబంధించి పూర్తి బండిల్స్ సిద్ధంగా ఉంచామనీ.. 28వ తేదీ తర్వాత ముద్రణకు పంపించనున్నట్లు తెలిపారు.

'ఈనాడు'వి విషపు రాతలు





ఎంవీపీ, వేపగుంటలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని, ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు

- రామోజీరావు క్షమాపణ చెప్పాలి
- భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఆ పత్రిక ప్రతుల దహనం



భీమిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను తగలబెడుతున్న నాయకులు

పెదగంట్యాడ, భీమునిపట్నం, ఎంవీపీకాలనీ, సింహాచలం: ఈనాడు అధినేత రామోజీరావు ప్రభుత్వంపై ప్రతి నిత్యం తన అక్కసును వెళ్లగక్కుతున్నారని.. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విద్వేషాన్ని పెంచేలా కట్టుకథలు రాస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఫైల్ ఫొటోలు అచ్చువేసి దారుణాలన్నీ ఇప్పుడే జరిగినట్లు చూపించే స్థాయికి 'ఈనాడు' దిగజారిపోవడం దారుణమన్నారు. గన్నవరం ఘటనలో ఈనాడు తీరును నిరసిస్తూ గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద, వేపగుంటలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ ఆధ్వర్యంలో, 31వ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో ఎల్లమ్మతోట వద్ద, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు ఆధ్వర్యంలో, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయం ఎదుట ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. భీమిలిలో నాయకులు మాట్లాడుతూ పాత ఫొటోలతో రోత పుట్టించే విధంగా వార్తను నిస్సిగ్గుగా అచ్చేసిన ఈనాడు.. పత్రిక విలువలను ఎప్పుడో గాలికొదిలేసిందన్నారు. అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ తొలి నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే ఉద్దేశంతోనే ఈనాడు తప్పుడు రాతలు రాస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలవాల్సిన ఈనాడు టీడీపీకి కొమ్ముకాస్తోందని ఆరోపించారు. తప్పుడు కథనంతో అడ్డంగా దొరికిపోయిన రామోజీరావు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీరోడ్‌లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, ఉరుకూటి చందు, నాయకులు ధర్మాల శ్రీను, కోమటి శ్రీనివాసరావు, బోగాది సన్నీ, సిరట్ల వాసు, రాజాన వెంకటరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, నాగిశెట్టి శ్రీను, మంత్రి శంకరనారాయణ, బొడ్డ గోవింద్, వెంకటేష్, చిత్రాడ వెంకటరమణ, శీర చిన్నారావు, సంపంగి ఈశ్వరరావు, రోజారాణి, ఎంవీపీకాలనీలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, అక్కరమాని రోహిణి, ముచ్చల లక్ష్మి, అప్పారి శ్రీవిద్య, వేపగుంటలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 93, 94, 97 వార్డుల అధ్యక్షులు దాసరి రాజు, ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, నాయకులు సంతోష్, వినోద్, వర్మ, శ్రీకాంత్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఏయూ పనితీరు సంతృప్తికరం'



ఫార్మసీ కళాశాలలో ఎఫ్‌డీఏ డైరెక్టర్ కార్మెలో

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటవుతున్న ఫార్మసీ హబ్‌ను గురువారం ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ(అమెరికా) డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మెలో రోసా సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆయన్ని ప్రాంగణానికి తీసుకువెళ్లి హబ్ విశేషాలను వివరించారు. ఫార్మా రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టేలా యువతను ప్రోత్సహించడానికి ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. ఎఫ్‌డీఏ ప్రతినిధుల బృందం ఇక్కడ ఏర్పాటయ్యే ప్రయోగశాలల వసతుల గురించి నిపుణులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. తర్వాత వర్సిటీ పరిపాలన భవనంలో వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. వర్సిటీ తరఫున ఎఫ్‌డీఏ డైరెక్టర్ కార్మెలో రోసాను వీసీ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఏయూలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో దాదాపు గంట సమయం వెచ్చించడానికి విచ్చేసిన ఎఫ్‌డీఏ డైరెక్టర్.. దాదాపు ఆరు గంటలకు పైగా ఇక్కడే గడిపారు. విభిన్న రంగాల్లో ఏయూ సాధిస్తున్న ప్రగతిని తెలుసుకుని.. సంతోషం వ్యక్తం చేశారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ విక్టర్, పాలక మండలి సభ్యులు ఎ.కె.ఎం పవార్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: పలు పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల 7 వరకు వరుసగా వివిధ పోటీ పరీక్షలు నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సెమిస్టర్ పరీక్షలు, 26న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జూనియర్ ఇంజనీర్, మార్చి 2 నుంచి 7వ తేదీవరకు కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షల రోజుల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎస్‌సీ, జీవీఎంసీ, పోలీసు, మెడికల్, విద్యుత్ శాఖల పాటు, వివిధ కాలేజీల నుంచి లైజినింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నం?

పోలీసుల అదుపులో నిందితుడు

భీమునిపట్నం: భీమిలిలో ఐదేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడ అప్పికొండ వీధిలో నివాసముంటున్న 50 ఏళ్ల గల వ్యక్తి తన ఎదురింట్లో ఉంటున్న ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకొచ్చి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అరవడంతో ఆమె తల్లి, చుట్టుపక్కలవారు వచ్చి అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై సీఐ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ అతన్ని అదుపులోకి తీసుకుని దిశ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారన్నారు.

ఏం పనిచేశారో చెప్పండి..!

ఆర్జేడీ, డీఈవోకు కమిషనర్ ఆదేశాలు

విశాఖ విద్య: విద్యాశాఖ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా అధికారులంతా బడిబాట పట్టాలని కమిషనరేట్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది జూన్ నుంచి 2023 జనవరి వరకు ఆర్జేడీ, డీఈవోలు ఏం పనిచేశారో తగిన ఆధారాలతో నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ కమిషనర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలు, తనిఖీలకు తదితర కార్యక్రమాలకు సంబంధించి నెల వారీగా తగిన రుజువులతో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ నెల 27 నాటికి నివేదిక అందజేయాలని, దీనిని అత్యవసరంగా భావించాలని ఆదేశించారు.

మహిళపై దుష్ప్రచారానికి ఐఐటీ తెలివి

- ఫేక్ ఈ మెయిల్‌తో అసభ్యకర మెసేజ్‌లు
- యువకుడిని అరెస్ట్ చేసిన సైబర్ పోలీసులు

దొండపర్తి: ఐఐటీ ఇంజనీరింగ్ తెలివి తేటలు యువతిపై దుష్ప్రచారానికి ప్రదర్శించాడు. టెక్నాలజీపై ఉన్న పట్టుతో.. ఎవరూ కనిపెట్టలేరన్న ధీమాతో ఫేక్ ఈమెయిల్ క్రియేట్ చేసి అసభ్యకర మెసేజ్‌లు పంపించాడు. మహిళ ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు అదే సాంకేతికతను వినియోగించి చాకచక్యంగా యువకుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన యువతి హెచ్‌పీసీఎల్ కంపెనీలో పనిచేస్తోంది. కొద్ది రోజుల నుంచి ఆమెకు గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ నుంచి అసభ్యకరంగా మెసేజ్‌లు రావడం ప్రారంభమయ్యాయి. అలాగే ఆ కంపెనీలో ఇతరుల ఈమెయిల్స్‌కు కూడా సదరు యువతి గురించి చెడుగా ప్రచారం చేస్తూ మెసేజ్‌లు పంపించాడు. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ కె.భవాని ప్రసాద్ సాంకేతికత సహాయంతో ఆ ఈమెయిల్స్ పంపిస్తున్నది అదే కంపెనీలో పనిచేస్తున్న సహోద్యోగి కడప జిల్లాకు చెందిన రామత్ మల్లికార్జున నాయక్‌గా గుర్తించారు. అతడు ఐఐటీ గౌహతిలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. టెక్నాలజీపై మంచి పట్టు ఉండడంతో ఎవరూ కనిపెట్టలేరన్న ధీమాతో ఈమెయిల్ క్రియేట్ చేసి యువతిపై దుష్ప్రచారానికి పాల్పడినట్లు తెలుసుకొని మల్లికార్జునను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సోషల్ మీడియాలో మహిళలను అగౌరవపరిచినా, కించపరిచినా ఉపేక్షించేది లేదని సైబర్ క్రైం సీఐ కె.భవాని ప్రసాద్ హెచ్చరించారు.

లిటిల్ కెర్నెల్ స్కూల్ మూసేయండి

- టీచర్‌పై కేసు నమోదు చేయండి
- లక్ష జరిమానా విధించండి
- డీఈవో చంద్రకళ ఆదేశాలు

సీతమ్మధార: సీతమ్మధారలోని లిటిల్ కెర్నెల్ ప్లే స్కూల్‌లో విద్యార్థులను ఎండలో పెట్టి.. దండన విధించిన ఘటనను డీఈవో చంద్రకళ తీవ్రంగా పరిగణించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్(అర్బన్), ఉపవిద్యాశాఖాధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం స్కూల్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. గుర్తింపు లేకుండా నడిపిస్తున్నందుకు రూ.లక్ష జరిమానా విధించారు. చైల్డ్ యాక్ట్ ప్రకారం ఈ సంఘటనకు కారణమైన టీచర్‌పై పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి గుర్తింపు లేని పాఠశాలలు మూసివేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు జరగకుండా జాగ్రత్త వహించాలని అన్ని పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు.

కేంద్రం కార్మికుల హక్కులను కాలరాస్తోంది

దొండపర్తి(విశాఖ దక్షిణ): కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన ఐఎన్‌టీయూసీ 33వ సర్వసభ్య సమావేశాలను ఏఐసీసీ అధ్యక్షుడు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే ప్రారంభించారు. రెండో రోజు జరిగిన సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం తదితర ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. కార్మికులకు తగిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ప్లీనరీ సమావేశాలకు ఆంధ్రా, తెలంగాణ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.వి.ఎ.ఎస్.రాజు, చైర్మన్ ఎం.ఎం.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.అర్జున్‌తో పాటు దేశంలో అన్ని ప్రాంతాల నుంచి 5 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ జి.సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ఎం.భాస్కరరావు, వర్కింగ్ కమిటీ సభ్యులుగా డి.వి.ఎ.ఎస్.రాజు, బి.అర్జున్ ఎన్నికయ్యారు.

భద్రతపై సమీక్ష

మహారాణిపేట: వచ్చే నెల 3, 4వ తేదీల్లో నగరంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ సమీక్ష నిర్వహించారు. వీఐపీలు ఉండే ప్రాంతాలు, సదస్సు నిర్వహించే ప్రాంతాల్లో బందోబస్తు కోసం అధికారులతో చర్చించారు. సదస్సు భద్రత, అవసరమైన సిబ్బంది నియామకం, ప్రముఖులకు గన్‌మెన్లు, ఎస్కార్టు తదితర విషయాలపై చర్చించారు.

చిన్నప్పుడు 'అనగనగా..'అంటూ అమ్మమ్మలు, నానమ్మలు కథలు చెప్పే రోజులు గుర్తున్నాయా? కథను ఊరిస్తూ.. ఊహించేలా చెబుతుంటే ఆ పాత్రల్లోకి మనం పరకాయ ప్రవేశం చేసేవాళ్లం. కడుపులో ఉన్నప్పుడే ప్రహ్లాదుడు 'నారాయణ మంత్రం'విని ఊకొట్టాడని.. తల్లిగర్భంలో ఉన్నప్పుడే అభిమన్యుడు 'పద్మవ్యూహం'గురించి విని నేర్చుకున్నాడని పురాణాల్లో చదువుకున్నాం. దృశ్య రూపంలో కంటే శ్రవణ రూప కథనంలో పిల్లల ఊహాశక్తి మెరుగుపడుతుంది. అందుకే మనిషి పరిణామక్రమంలో కథ ప్రాధాన్యం అనన్య సామాన్యం. అయితే నేటి కంప్యూటర్ యుగంలో ఆ అదృష్టం పిల్లలకు పూర్తిగా దూరమైంది. కెరీర్ పరుగులో పడిపోయి.. పిల్లలకు కథలను చెప్పగలిగేంత సమయం, ఓపిక రెండూ తల్లిదండ్రులకు దొరకడం లేదు. అందుకే ఇప్పటి పిల్లలు కథలంటే గుగూల్‌లో సెర్చ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందిస్తూ చదువుపై వారికి ఆసక్తి కలిగించి.. తద్వారా వారిలోని సృజనాత్మక శక్తిని, నిద్రాణంగా దాగి ఉన్న కళలను వెలికి తీసే ఉద్దేశంతోనే పుట్టిందే స్టోరీ టెల్లింగ్ డే. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చక్కటి స్పందన లభిస్తోంది. – విశాఖపట్నం డెస్క్





కథ చెబుతాం ఊ కొడతారా..

నేటితరం చేతుల్లో పుస్తకాలు నలగవు కానీ ఫోన్లలోని యాప్స్ గిరగిరా తిరుగుతుంటాయి. స్మార్ట్ ఫోన్లు, వీడియో గేమ్‌లు, ఇంటర్నెట్‌లతో కాలం గడిపే చిన్నారుల్లో సృజనాత్మకశక్తి పూర్తిగా తగ్గిపోవడంతో పాటు వారిలో ఊబకాయం తదితర దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అనేక సర్వేలు వెల్లడించాయి. 'మీ పిల్లలు తెలివిగల వాళ్లు కావాలంటే వారికి రోజూ కథలు చెప్పండి'అని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పారంటే.. చిన్నారుల జీవితాలను కథలు ఎంతగా ప్రభావితం చేయగలవో అర్థం అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రుల ఆలోచనల్లో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. పిల్లలకు ప్రతి రోజూ కథలు చెప్పే సమయం దొరక్కపోయినా.. వారాంతాల్లో తప్పనిసరిగా 'స్టోరీ టెల్లింగ్' కార్యక్రమాలకు తీసుకెళ్తున్నారు. పాఠశాలల్లో సైతం వారంలో కనీసం రెండు రోజులు స్టోరీ టెల్లింగ్ క్లాసులు ఉండేలా యాజమాన్యాలకు అభ్యర్థిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నగరంలో స్టోరీ టెల్లింగ్ నిపుణులు, ఈ తరహా కార్యక్రమాలకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది.

- చిన్నారుల్లో పఠనాసక్తి పెంచేలా కొత్త కాన్సెప్ట్
- పౌర గ్రంథాలయంలో స్టోరీ టెల్లింగ్ డే
- ఆసక్తి కనబరుస్తున్న పిల్లలు

'మియావాకీ' అలా మొదలైంది



షిపీ కుమారి

కథల ద్వారా పిల్లలను చదువు వైపు మళ్లించడం సులభమని ఉపాధ్యాయురాలు, ప్రముఖ స్టోరీ టెల్లర్ షిపీ కుమారి అంటున్నారు. జార్ఖండ్‌లోని ధన్‌బాద్ నివాసి అయిన షిపీ కుమారి ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఉద్యోగ రీత్యా 2006లో విశాఖ వచ్చారు. ఇక్కడ ఓ ప్రైవేట్ పాఠశాలలో సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధిస్తున్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం కమిటీ కార్యదర్శి డీఎస్ వర్మ చొరవతో 7 నెలల కిందట మియావాకీ స్టోరీ టైమ్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. పౌర గ్రంథాలయంలో నెలలో రెండు రోజులు ఒకటి నుంచి 4వ తరగతి పిల్లలకు ఉదయం 10.15 నుంచి 11.30 వరకు, 5వ తరగతి నుంచి 8 తరగతి చదివే పిల్లలకు 11.15 నుంచి 12.30 వరకు కథలు చెప్పడం ప్రారంభించారు. తొలుత షిపీ కుమారి ఒక్కరే పిల్లలకు చక్కని కథలు చెబుతూ.. వివిధ అంశాలు వివరించేవారు. ఆమె తలపెట్టిన ఈ కార్యానికి తర్వాత నగరానికి చెందిన స్టోరీ టెల్లర్, వాయిస్ ఆర్టిస్ట్ సీతా శ్రీనివాస్, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) ఎడ్యుకేటర్ శ్రావ్య గరుడ, ఉపాధ్యాయిరాలు రబియా నవాజ్ తోడయ్యారు. వారు స్వచ్ఛందంగా తమ సేవలందిస్తూ చిన్నారులను తీర్చిదిద్దే గురుతర బాధ్యతలో భాగస్వాములయ్యారు. ఒక్క స్టోరీ టెల్లింగ్ ఎన్నో కళలను వెలికి తీస్తుందని షిపీకుమారి తెలిపారు. స్టోరీ టెల్లింగ్ క్లాస్ పూర్తయిన ప్రతిసారీ తాము పిల్లలతో డ్రాయింగ్, క్రాఫ్ట్స్, సింగింగ్, పప్పెట్రీ, ఒరిగామి తదితర కృత్యాలు పిల్లలతో చేయిస్తామని.. తద్వారా పిల్లల్లో తాము అనుకున్నది వ్యక్తీకరించే స్వతంత్రత వస్తుందన్నారు. భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్, విశాఖ పౌర గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయం మూడో అంతస్తులోని పిల్లల విభాగంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు.

కథ చెప్పడం ఓ కళ

శ్రోతలను ఆకట్టుకునేలా కథలను చెప్పగలగడం ఓ ప్రత్యేకమైన కళ. కథల్లోని అంశాలకు తగ్గట్టు ఓ ఊహాజనిత లోకాన్ని కళ్లకు కట్టేలా కథలు చెప్పగలిగినపుడే శ్రోతలు ఆ కథలో పూర్తిగా నిమగ్నమవుతారు. ఇప్పటి స్టోరీ టెల్లర్స్ వారి హావభావాలను కథలతో కలిపి వ్యక్తీకరించడంతో పాటు పెయింటింగ్స్, పేపర్ కటింగ్స్, పాటలు వంటి వాటిని తమ మాధ్యమాలుగా వినియోగిస్తున్నారు. ఎంచుకున్న కథతోపాటు ఎత్తుగడ, ముగింపు అనే అంశాలు ఓ స్టోరీ టెల్లర్ నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. కథలు అనగానే కేవలం చిన్నారులకు మాత్రమే పరిమితం అనుకుంటే పొరబడ్డట్టే. ఎన్నో ఒత్తిళ్లతో సతమతమయ్యే పెద్ద వారికి సైతం ఈ తరహా కథకాలక్షేపాలు ఎంతో ఉత్సాహాన్ని అందిస్తాయి.

కథ అంటే ఓకే అంటారు

సాధారణంగా పాట పాడదామా, డ్రాయింగ్ వేద్దామా అని పిల్లలను అడిగితే కొందరు మాత్రమే సరేనంటారు. అదే కథ వింటారా అంటే అందరూ ఓకే అంటారు. కథ చెప్పడం అనేది ఓ కళ. మిగతా కళలతో పోలిస్తే కథల్లో వినేవాళ్లే కళాకారులు. ఎందుకంటే కథ వినేవాళ్లు వాళ్ల బుర్రల్లో పాత్రలను ఊహించుకుంటారు. అందుకే కథలను అందరూ ఇష్టపడతారు. కెనడాలో మూడేళ్ల కిందట స్కూల్ కరిక్యులమ్‌లో స్టోరీ టెల్లింగ్‌ను చేర్చారు. మన సంప్రదాయంలో అది ఎప్పట్నించో ఉంది. చరిత్ర, పురాణాలను కథల ద్వారానే మనం చెప్తాం కదా..

ఊహాశక్తితో పాటు భాషా పరిజ్ఞానం

కథలు వినడం వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. తరగతుల్లో చెప్పే పాఠాల్లో దాదాపు సగం చిన్నారులకు గుర్తు ఉండవు. అదే ఓ కథలోని ప్రతీ సంఘటన పిల్లల మనసుల్లో బలంగా నాటుకుపోతుంది. వారిలో ఊహాశక్తి పెరుగుతుంది. కథ చెబుతూ పోతుంటే ఆ తర్వాత ఏం జరుగుతుందన్న విషయాన్ని చిన్నారులు ఊహిస్తూ ఉంటారు. ఇదే వారి మానసిక ఎదుగుదలకు ఉపయుక్తంగా నిలుస్తుందని నిపుణుల అభిప్రాయం. ఇక చరిత్రకు సంబంధించిన అంశాలను కథల్లా చెప్పడం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయవచ్చు. మాతృభాషతో పాటు ఇంగ్లిష్, హిందీ తదితర భాషల్లో పిల్లలకు కథలు చెబితే వారికి భాషా పరిజ్ఞానం కూడా పెరుగుతుంది.

కథల్లా పాఠాలు



కథలు వింటూ పాఠాలు వినడం.. కథలే పాఠాలైపోవడం నాకెంతో నచ్చింది. ఇంతకు ముందు చదివింది గుర్తుండేది కాదు. ఇప్పుడు మా బుక్స్‌లోని లెసన్స్ కథల్లా మారిపోయాక.. బాగా గుర్తుంటున్నాయి. మార్కులు కూడా బాగా వస్తున్నాయి. – బి.తనూశ్రీ, 3వ తరగతి, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్

క్లాసెస్ బాగుంటున్నాయి



స్టోరీ టెల్లింగ్ క్లాసెస్ చాలా బాగుంటున్నాయి. లైబ్రరీలో కొత్తకొత్త పుస్తకాలు కూడా నాకు చాలా నచ్చుతున్నాయి. బుక్స్ రీడింగ్ వల్ల కొత్త విషయాలు తెలుస్తున్నాయి. కథలు నేర్చుకోవడంతో పాటు చెప్పడం అలవాటు చేసుకుంటున్నా.. – సూర్య విహాన్ వర్మ, 3వ తరగతి, టింపనీ సీనియర్ సెకండరీ స్కూల్

అద్భుతాలు చేయవచ్చు



కథలు ఎవరికైనా నచ్చుతాయి. అవి ఏ వయసు వారికైనా గుర్తుండిపోతాయి. కథ, కథలు చెప్పే విధానంలోను నవ్యత ఉంటే అవి మనల్ని జీవితాంతం వెంటాడుతాయి. మేం చేస్తున్నది అదే. కథల ద్వారా చిన్ని మనసుల్లో నైపుణ్యాన్ని చొప్పిస్తున్నాం. ఈ నెల 26న మియావాకీ స్టోరీటైమ్‌లో మళ్లీ కలుద్దాం. – సీతా శ్రీనివాస్, స్టోరీ టెల్లర్, వాయిస్ ఆర్టిస్ట్

విద్యార్థులకు మేలు చేస్తుంది



స్టోరీ టెల్లింగ్ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. ఏదైనా కథలా చెబితే వారికి ఇట్టే గుర్తుండిపోతుంది. ఒక్క చదువే కాదు.. సరైన రీతిలో భావవ్యక్తీకరణ అనేక విధాలుగా జీవితంలో ఉపయోగపడుతుంది. స్టోరీ టెల్లింగ్ ద్వారా ఆ నైపుణ్యం పిల్లలకు అందించేందుకు మేం కృషి చేస్తున్నాం. – శ్రావ్య గరుడ, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్(స్టెమ్) ఎడ్యుకేటర్

ప్రజల్లో మార్పుతో తగ్గిన ప్లాస్టిక్ వినియోగం



నగరంలో ఏర్పాటు చేసిన కియోస్కు

డాబాగార్డెన్స్: ప్లాస్టిక్ నిషేధంతో ప్రజల్లో మార్పు వచ్చిందని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ముందు నగరంలో రోజుకు 10 టన్నుల ప్లాస్టిక్‌ను వినియోగించేవారని.. నిషేధం తర్వాత అది 3 టన్నులకు చేరిందన్నారు. పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాగితపు, చెక్క, ఆకులతో చేసిన వస్తువులను వినియోగించాలని సూచించారు. చెక్క, ఆకులు, పేపర్‌స్ట్రాల్, నార తదితర వస్తువులు తక్కువ ధరకే అందుబాటులో ఉండేలా పూర్ణా మార్కెట్‌లో మొదట ప్లాస్టిక్ కియోస్కు ప్రారంభించగా.. విజయవంతమైందన్నారు. ఈ క్రమంలో గవరకంచరపాలెం, అనకాపల్లి మెయిన్‌రోడ్డు, గాజువాక, మధురవాడ, తగరపువలస, వేపగుంట, ఎంవీపీ కాలనీ, జగదాంబ జంక్షన్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో ఈ కియోస్కులు ప్రారంభించామన్నారు. ఈ ప్లాస్టిక్ కియోస్కుల ద్వారా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆమోదించిన మొక్కజొన్న ముడి పదార్థాలతో తయారు చేసిన క్యారీ బ్యాగులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇవి 90 రోజుల్లో భూమిలో పూర్తిగా కలిసిపోయి ఎరువుగా మారుతాయని పేర్కొన్నారు. భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు నగర ప్రజలు ప్లాస్టిక్‌ను విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



సాగర్‌నగర్ బీచ్ వద్ద గుర్తుతెలియని మృతదేహం

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఇది గుర్తించిన ఓ పర్యాటకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 48 ఏళ్లు ఉంటాయి. నలుపు రంగు ప్యాంట్, బెల్ట్ ధరించి ఉన్నాడు. ఎత్తు 5.3 అడుగులు ఉండొచ్చు. నలుపు వర్ణపు ఛాయలో ఉన్నాడు. మృతుడి నోటి వెంట నురుగలు వస్తున్నాయి. మృతదేహం పక్కనే బ్యాగ్ ఉంది. అందులో గులాబీ రంగు చొక్కా, చుక్కల చొక్కాతో పాటు ఓ ప్యాంట్ ఉంది. మృతుడికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు.

రేపు వీపీటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సమీక్ష

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) కార్యకలాపాలపై ఈనెల 25వ తేదీన సమీక్ష నిర్వహించనున్నట్లు పోర్టు ట్రస్ట్, డీసీఐ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్స్ పంత్ ఆధ్వర్యంలో సమీక్ష జరగనుందని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకోనున్న పంత్.. శనివారం ఉదయం పోర్టు, డీసీఐని సందర్శించి సమీక్షించనున్నారని తెలిపారు.

బాలల హక్కులు హరిస్తే క్రిమినల్ చర్యలు



స్కూల్ యాజమాన్యాన్ని విచారిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

సీతమ్మధార: బాలల హక్కులు హరిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం హెచ్చరించారు. ప్లే స్కూల్‌లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టేలా విద్యా శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సీతమ్మధారలోని లిటిల్ కెగ్గెల్ ప్లే స్కూల్‌లో ఎండలో విద్యార్థులను దండించినట్లు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వార్డు సచివాలయాల అధికారులతో కలిసి గురువారం పాఠశాలను సందర్శించారు. పిల్లలు, వారి తల్లిదండ్రులను విచారించారు. ప్రిన్సిపాల్ వెన్నెల నుంచి వివరాలు సేకరించారు. ఇటువంటి సంఘటన పునరావృతం అయితే చట్ట ప్రకారం కఠిన చర్యలకు ఆదేశాలిస్తామన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు విఘాతం కలిగించే వ్యక్తులు, సంస్థలపై apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈవో సువర్ణ, సచివాలయ కార్యదర్శులు ఎస్.శిరీష, ఇంద్రజ, పి.రంజిత, డి.నిర్మలదేవి, వి.వెంకటలక్ష్మి, వై.మంగ, ఎన్.జనార్దనరావు, సీఆర్పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శకుంతల, ఫోరం ప్రతినిధులు డాక్టర్ జగ్గారావు, లవకుశ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర కళాశాల వసతి గృహం ఇన్‌చార్జిగా సత్యనారాయణ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం ఇన్‌చార్జి వార్డెన్‌గా భీమిలి కళాశాల వసతిగృహం వార్డెన్ బి.సత్యనారాయణకు ఏఎస్‌డబ్ల్యూవో పి.సత్యనారాయణ గురువారం బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు వసతి గృహం స్టోర్ రూమ్ తాళాలను విద్యార్థులు, సచివాలయ సిబ్బంది సమక్షంలో బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. అందులో ఉన్న బియ్యం, కిరాణా, కూరగాయలను లెక్కించి నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూవో పి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ నెల 16న సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ డీవీ రమణమూర్తి వసతి గృహానికి తనిఖీ కోసం వచ్చినప్పుడు స్టోర్ రూమ్‌లో సరకులు, స్టాక్ రిజిస్టర్‌తో పోల్చినప్పుడు తేడాగా ఉన్నాయన్నారు. దీంతో 17న వార్డెన్ నాగార్జునను సస్పెండ్ చేశారన్నారు. సస్పెండ్ ఆర్డర్ తీసుకోకుండా వారం రోజులుగా నాగార్జున విధులకు గైర్హాజరు కావడంతో ఆయన స్థానంలో బి.సత్యనారాయణను ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. దీనిపై నాగార్జున మాట్లాడుతూ ఏడీ డీవీ రమణమూర్తిపై పలు ఆరోపణలతో కూడిన కరపత్రం ఎవరో ప్రచురిస్తే.. తనను అనుమానించి కక్ష సాధింపు చర్యలు చేపట్టారన్నారు. దీనిపై తాను ఈ నెల 17 నుంచి 25 వరకు మెడికల్ లీవు పెట్టి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా సస్పెన్షన్‌పై స్టే మంజూరు చేసిందన్నారు. వసతి గృహానికి అవసరమైన సరకులు ఈ నెల 25 వరకు అప్పగించానన్నారు. గురువారం తాను లేకుండా స్టోర్‌రూమ్ తాళాలు బద్దలు కొట్టి సరకులకు కిలోల్లో కొలవకుండా.. బస్తాల్లో లెక్కించి లెక్కల్లో అవకతవకలు తనపై మోపాలని చూస్తున్నారన్నారు. మండల మెజిస్ట్రేట్ సమక్షంలోనే స్టోర్‌రూమ్ తాళాలు తెరవాలని నాగార్జున గుర్తు చేశారు.

తీగపై బతుకు నడక



ఆకాశపుటంచుపై.. ఆకలి అడుగులు వేస్తూ.. బతుకుని బ్యాలెన్స్ చేస్తూ.. జీవిత చక్రంలో అడుగులు వేస్తున్న పసి మనసులు ఓవైపు... వారి బతుకు ఫీట్లు చూస్తూ.. ఆనందిస్తున్న మధ్యతరగతి మనసులు మరోవైపు ఇలా బీచ్‌రోడ్డులో తారసపడ్డాయి.

వడ్రంగి పిట్ట.. వడ్రంగి పిట్ట



చెట్టు తొర్రలో నివాసం ఏర్పరచుకుంటుంది. పదునైన ముక్కుతో ఎంతటి కఠినమైన చెట్టుకైనా సునాయాసంగా రంధ్రం చేస్తుంది. వివిధ వర్ణాల గల అందమైన ఈ వడ్రంగి పిట్ట తన కొత్త ఇంటిని నిర్మించుకునే పని ప్రారంభించింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పిట్ట కనిపించింది.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం